క్లుప్తంగా

ఉత్తమ ఫలితాలు సాధించాలి



ఎంఈఓను సన్మానిస్తున్న టీచర్లు

దుత్తలూరు : రానున్న ఇంటర్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఈఓ బాలకృష్ణారెడ్డి తెలిపారు. స్థానిక ఏపీ మోడల్ పాఠశాలలో ద్వితీయ సంవత్సర విద్యార్థులకు వీడ్కోలు సమావేశం మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. అనంతరం ఎంఈఓతో పాటు ఎంపీడీఓ సాయిప్రసాద్‌ను పాఠశాల సిబ్బంది శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సైమన్ రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేకునాంపేటలో రీసర్వే ప్రారంభం



డ్రోన్‌ను ప్రారంభిస్తున్న తహసీల్దార్

కొండాపురం : మండలంలోని నేకునాంపేట మండలంలో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా భూ రీసర్వేను తహసీల్దార్ ఎం.బ్రహ్మయ్య మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 26 రెవెన్యూ గ్రామాలు ఉండగా, ఇప్పటికే మల్లవరప్పాడు, తూర్పు జంగాలపల్లి గ్రామాల్లో సర్వే జరిగిందన్నారు. కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ శ్యాంసన్, వీఆర్వో మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

నెల్లూరు(క్రైమ్): అదనపు కట్నం కోసం వివాహితను వేధించడంతో పాటు దాడి చేసిన వారిపై బాలాజీనగర్ పోలీసులు కేసును మంగళవారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ముత్యాలపాళేనికి చెందిన రాజేశ్వరికి కృష్ణప్రసాద్‌తో 2018లో వివాహమైంది. కొంతకాలం వీరు సంతోషంగా జీవించారు. అనంతరం కలతలు చోటుచేసుకున్నాయి. అదనపు కట్నం కోసం రాజేశ్వరిని కృష్ణప్రసాద్, అతని తల్లిదండ్రులు, తమ్ముడు వేధించసాగారు. ఇటీవల ఆమెపై దాడి చేసి చంపుతామని బెదిరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మహిళపై దాడి

నెల్లూరు(క్రైమ్): ఓ మహిళపై ఆమె భర్త మొదటి భార్య, కుమారుడు దాడి చేసిన ఘటనపై బాలాజీనగర్ పోలీసులు కేసును మంగళవారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ఎన్టీఆర్‌నగర్‌లోని రాయపుపాళేనికి చెందిన రమణయ్యకు రాజేశ్వరితో గతంలో వివాహమైంది. కుటుంబకలహాల నేపథ్యంలో వీరు విడిపోయారు. అనంతరం సుమతిని వివాహం చేసుకున్నారు. రాజేశ్వరి, ఆమె కుమారుడు శ్రీకాంత్ ఈ నెల ఐదో తేదీన రమణయ్య ఇంటికెళ్లారు. అక్రమంగా ప్రవేశించి అందులో ఉన్న సామగ్రిని తీసుకెళ్తుండగా, సుమతి అడ్డుకున్నారు. దీంతో ఆగ్రహానికి గురైన వారు ఆమెపై దాడి చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పట్టా భూములుగా గుర్తించాలని వినతి

నెల్లూరు(అర్బన్): ఏళ్లగా సాగు చేసుకుంటున్న తమ భూములను రీ సర్వేలో అధికారులు ప్రభుత్వ భూములుగా చూపారంటూ బోగోలు మండలం ఉమామహేశ్వరపురానికి చెందిన పలువురు రైతులు కలెక్టరేట్ వద్ద ఆందోళనను మంగళవారం చేపట్టారు. జేసీ కూర్మనాథ్‌కు వినతిపత్రాన్ని అందజేసిన అనంతరం రైతులు వెంకయ్య, రాజేష్ మాట్లాడారు. తాము సాగు చేసుకుంటున్న భూములకు దశాబ్దాల క్రితమే పట్టాలను ఇచ్చారని చెప్పారు. అవి ఒకరిద్దరి చేతులు మారాయని, రిజిస్ట్రేషన్లు సైతం జరుగుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం రీ సర్వేలో అధికారులు ప్రభుత్వ భూములుగా చూపుతుండటం తగదన్నారు. సదరు భూములను పట్టా భూములుగా గుర్తించాలని కోరారు. రైతులు కృష్ణయ్య, ప్రసాద్, మురళి, చైతన్య, శ్రీనయ్య, తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ ఏటీఎం కేంద్రం ప్రారంభం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): స్టోన్‌హౌస్‌పేటలోని తడికలబజార్ సెంటర్‌లో డీసీసీబీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఏటీఎం సెంటర్‌ను సీఈఓ శంకర్‌బాబు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఖాతాదారుల సౌకర్యార్థం ఏటీఎం కేంద్రాన్ని ప్రారంభించామని వివరించారు. జీఎం సరిత, ఆప్కాబ్ అధికారి శ్రీనివాస్, ఏజీఎం మధుసూదన్‌రావు, డీసీసీబీ స్టోన్‌హౌస్‌పేట బ్రాంచ్ మేనేజర్ శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

- ఆర్డీఓ సాధు కరుణకుమారి



ఆత్మకూరు : సమావేశం నిర్వహిస్తున్న ఆర్డీఓ కరుణకుమారి

ఆత్మకూరు : తూర్పు రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పక్షాలు సహకరించాలని ఆత్మకూరు ఆర్డీఓ సాధు కరుణకుమారి అన్నారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని అన్ని మండలాల ఎంపీడీఓలు, తహసీల్దార్లు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నేతలతో ఆమె మంగళవారం సమావేశం నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉందని, 16న నోటిఫికేషన్ విడుదలవుతుందని, 23లోపు నామినేషన్లు దాఖలు చేసుకోవచ్చని, 24న స్క్రూటినీ ఉంటుందన్నారు. 27న విత్‌డ్రాలు చేసేందుకు అవకాశం ఉందన్నారు. మార్చి 13న ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతుందని, ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగనుందన్నారు. తొలుత బ్యాలెట్ బాక్సులను నెల్లూరుకు, అనంతరం కౌంటింగ్ నిర్వహించే చిత్తూరుకు తరలించనున్నట్లు వివరించారు. కోడ్ ఉండడంతో ప్రభుత్వం తరఫున కొత్తగా టెండర్లు పిలవడం, అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు చేయరాదన్నారు. మద్యం, నగదు సరఫరా లాంటివి జరగకుండా ప్రత్యేక స్క్వాడ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. కాగా పోలింగ్ కోసం ఆత్మకూరు, ఉదయగిరిలలో మూడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, మండల కేంద్రాల్లో ఒకటి చొప్పున ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలాధికారులు పోలింగ్ కేంద్రాలను పరిశీలించి సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్‌లను గుర్తించి ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎన్నికల సిబ్బందికి మూడు విడతలుగా ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలియజేశారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకే ఎన్నికల ప్రచారం నిర్వహించాలని, లౌడ్ స్పీకర్లు లాంటి వాటికి ముందస్తు అనుమతులు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు కొండా వెంకటేశ్వర్లు, నోటి వినయ్ కుమార్‌రెడ్డి, టీడీపీ నేత టి.చంద్రారెడ్డి, బీఎస్పీ నేత నందా ఓబులేసు, కాంగ్రెస్ తరఫున వన్నం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

బిట్రగుంట : బోగోలు, విశ్వనాథరావుపేట మేజర్ పంచాయతీల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎస్సై చిన బలరామయ్య మంగళవారం తనిఖీ చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల్లో కల్పించాల్సిన వసతులు, చేపట్టాల్సిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండల పరిధిలో మొత్తం 1,405 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు, 45 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారన్నారు. పట్టభద్రుల ఓటర్ల కోసం రెండు, ఉపాధ్యాయ ఓటర్ల పోలింగ్ కోసం ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

వైభవంగా శివరాత్రి బ్రహ్మోత్సవాలు



సంగం : ధ్వజారోహణం గావిస్తున్న అర్చకులు



కావలి రూరల్ : భృంగీశ్వర సేవలో మల్లేశ్వరుడు

సంగం : మండలంలోని వంగల్లు గ్రామంలో కామాక్షిదేవి సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో ధ్వజారోహణంతో శివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ముందుగా ఆలయంలోని స్వామి, అమ్మవార్ల ధ్వజ స్తంభాల వద్ద అర్చకులు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ధ్వజారోహణం చేసి భక్తులకు కొడిముద్దలు అందజేశారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. 21వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని ఆలయ చైర్మన్ పగడాల రఘురామయ్య తెలిపారు.

రుద్రపాద క్షేత్రంలో..

కావలి రూరల్ : పట్టణంలోని రుద్రపాద క్షేత్రంలో కొలువైన దుర్గా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం భృంగీశ్వర సేవ చేపట్టారు. తొలుత స్వామివారికి విశేష అభిషేకాలు, పల్లకి సేవ గావించారు. అనంతరం భృంగీశ్వర సేవ, గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు జరిపించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పంట దిగుబడి పెంచడమే లక్ష్యం



శనగ పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి కె.శీనయ్య

అనుమసముద్రంపేట : పంట దిగుబడి పెంచడమే వ్యవసాయశాఖ లక్ష్యమని వ్యవసాయశాఖ అధికారి కె.శీనయ్య అన్నారు. మండలంలోని రాజవోలు ఆర్బీకే ఆధ్వర్యంలో పంట కోత ప్రయోగాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మినుము, పెసర, శనగ, వేరుశనగ, వరి పంటలకు ప్రభుత్వం బీమా కల్పిస్తోందన్నారు. రైతులు పంటలు వేసే సమయంలో జాగ్రత్తలు పాటించి దిగుబడి పెంచుకోవాలని తెలిపారు. రాజవోలులో 20 ఎకరాల్లో శనగ పంట వేసిన రైతు శీనయ్యకు సూచనలు చేశారు. ఆయన వెంట బీమా అధికారి సతీష్, ఏఎస్ఓ కె.రాజేంద్ర, వీహెచ్ఏ విజయమ్మ, రైతులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదును పూర్తి చేయండి



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీరామకృష్ణ

అల్లూరు : నిర్దేశించిన గడువులోపు ఈ-క్రాప్ నమోదును పూర్తి చేయాలని తహసీల్దార్ శ్రీరామకృష్ణ అధికారులకు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, సర్వేయర్లు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లతో ఆయన మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు సాగు చేసిన ప్రతి ఎకరాను ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవాలన్నారు. దీనివల్ల ప్రభుత్వ పథకాలకు అర్హులవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీటీ చెంచయ్య, ఏఓ వేణుగోపాల్‌రావు, రీసర్వే డీటీ సైమన్‌బాబు, సర్వేయర్ అనురూప్, ఆర్ఐ సుధీర్, హౌసింగ్ ఏఈ జమీల్ తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్స్ ఫెలోషిప్ మండల కమిటీ ఎన్నిక



పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం

వింజమూరు : మండల పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. మండలంలోని చింతలపాళెం చర్చిలో మండలంలోని పాస్టర్లు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. 2023 సంవత్సరానికి నూతన కమిటీలో గౌరవాధ్యక్షుడిగా ఏసుదాసు, అధ్యక్షుడిగా బాలసుందరం, ఉపాధ్యక్షుడిగా ఎస్.డేవిడ్, కార్యదర్శిగా యాకోబు, జాయింట్ సెక్రటరీగా ప్రభు కుమార్, ట్రెజరర్‌గా పాల్, కార్యనిర్వాహక సభ్యులను ఎన్నుకున్నారు.

మంత్రి రజనిని కలిసిన ఎమ్మెల్యే రామిరెడ్డి

కావలి : చిలకలూరిపేటలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి విడదల రజనిని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కావలి ప్రభుత్వ ఏరియా వైద్యశాల, అల్లూరు ప్రభుత్వ వైద్యశాలలో ఉన్న సమస్యలను తెలియజేశారు. అలాగే కావలిలో డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.

ఒత్తిడిని అధిగమించాలి



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

కావలి రూరల్ : విద్యార్థులు మానసిక ఒత్తిడిని అధిగమిస్తే మంచి ఫలితాలు సాధిస్తారని వైఎస్సార్ టీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్.మునీర్ జాన్ తెలిపారు. కావలి రూరల్ మండలంలోని చెంచుగానిపాళెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒత్తిడిని అధిగమించేందుకు యోగా, సైక్లింగ్ ఎంతో దోహదపడుతాయన్నారు. అనంతరం విద్యార్థులకు కేన్సర్‌పై అవగాహన కల్పించి విద్యార్థులతో యోగాసనాలు, సైక్లింగ్ చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ జంపాని జాలమ్మ, హెచ్ఎం ఎన్.శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు ముమ్మర ఏర్పాట్లు



రైతులతో మాట్లాడుతున్న సివిల్ సప్లయ్స్ డీటీ శ్యామలాదేవి

ఆత్మకూరురూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలుకు ముమ్మర ఏర్పాట్లు చేస్తోందని వ్యవసాయ, పౌర సరఫరాల శాఖ అధికారులు పేర్కొన్నారు. మండలంలోని కరటంపాడు, బోయలచిరివెళ్ల రైతు భరోసా కేంద్రాల పరిధిలో మంగళవారం ధాన్యం కొనుగోలు ప్రక్రియపై రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆత్మకూరు సివిల్ సప్లయ్స్ డిప్యూటీ తహసీల్దార్ శ్యామలాదేవి మాట్లాడుతూ రైతులకు అవసరమైన గోనె సంచులు, రవాణా సదుపాయాలు, హమాలీలకు సంబంధించిన సేవలు ఆయా కొనుగోలు కేంద్రాల ద్వారా పొందవచ్చని తెలిపారు. మండల ఏఓ కిశోర్‌బాబు మాట్లాడుతూ వరి ధాన్యాన్ని తీసుకొచ్చే రైతులు తప్పనిసరిగా 17 శాతం తేమ ఉండేలా చూసుకోవాలని, తద్వారా గిట్టుబాటు ధరకు తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు యస్దానీ, శ్రావణి, ఎంపీటీసీ సభ్యుడు ఖాసీంసా, బోయలచిరివెళ్ల సర్పంచ్ బొలిగర్ల వెంకటేశ్వర్లు, వీఆర్వో ప్రతాప్ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ట



పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

ఉదయగిరి : మండలంలోని గండిపాళెం జలాశయం వద్ద కొలువైన సిద్ధేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు మంగళవారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గంగానయనం, గణపతి పూజ, రక్షాబంధనం, యాగశాల ప్రవేశం, కలశస్థాపన, అగ్నిప్రతిష్ఠ, దీక్షా హోమాలను వేదపండితులు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వ్యాయామంతో అనేక ప్రయోజనాలు

- సైకిల్ తొక్కడం ద్వారా వ్యాధులు దూరం
- డిప్యూటీ డీఎంహెచ్ఓ బ్రిజిత



సంగంలో సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్లు, వైద్యారోగ్య సిబ్బంది

అల్లూరు : ప్రతిరోజు వ్యాయామం చేయడం ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయని డిప్యూటీ డీఎంహెచ్ఓ బ్రిజిత తెలిపారు. ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా ఇస్కపల్లి పంచాయతీ పరిధిలోని చంద్రబాబునగర్ కాలనీలో కేన్సర్‌పై అవగాహన కార్యక్రమాన్ని డిప్యూటీ డీఎంహెచ్ఓ బ్రిజిత మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేన్సర్, క్షయ లాంటి వ్యాధుల పట్ల జాగ్రత్తలు వహించాలన్నారు. ప్రతిరోజు సైకిల్ తొక్కడం వల్ల అనేక వ్యాధులు రాకుండా ఉంటుందన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ వైద్య పథకాలకు సంబంధించి స్థానికులకు అవగాహన కల్పించారు. అనంతరం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నవీన్ కుమార్, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యానికి మేలు

అనుమసముద్రంపేట : సైకిల్ తొక్కడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు అని ఏఎస్‌పేట వైద్యులు డాక్టర్లు రమేష్‌బాబు, జ్యోతిరాణి అన్నారు. మండలంలోని చిరమన, ఏఎస్‌పేట పీహెచ్‌సీల పరిధిలో ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో కలిసి మంగళవారం సైకిల్ ర్యాలీ చేశారు. సైకిల్ తొక్కడం వల్ల ఆరోగ్య వంతులుగా ఉంటారని, గుండె జబ్బులు, కేన్సర్ లాంటి వ్యాధులు రాకుండా ఉంటాయన్నారు.

- సంగం : మండల వైద్యాధికారి డాక్టర్ ప్రతిమ ఆధ్వర్యంలో మంగళవారం కేన్సర్‌పై సంగంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా పీహెచ్‌సీ సిబ్బంది, విద్యార్థులు స్థానిక పీహెచ్‌సీ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు సైకిల్ తొక్కుతూ ర్యాలీ చేశారు. కేన్సర్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ప్రతిమ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో వ్యాయామం లేక ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారని, సైకిల్ తొక్కడం వల్ల శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంతో ఉండడంతో పాటు కేన్సర్ వంటి వ్యాధుల నుంచి తప్పించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు షేక్.జలీల్‌అహ్మద్, వసంతమ్మ, ప్రమీలమ్మ, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.
- చేజర్ల : మండలంలోని చేజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం కేన్సర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల్లో కేన్సర్ పట్ల అవగాహన కల్పించేందుకు ఆయుష్మాన్ భారత్ కింద అవగాహన ర్యాలీ నిర్వహించామని చేజర్ల సీహెచ్‌సీ డాక్టర్ ప్రమీలా రాజకుమారి అన్నారు. వ్యాయామం, వాకింగ్, యోగా, సైక్లింగ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ మెహతాబ్, సీహెచ్ఓ చంద్రయ్య, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.
- ఉదయగిరి : మండలంలోని గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యసిబ్బంది కేన్సర్ నివారణపై అవగాహన కల్పిస్తూ మంగళవారం ఉదయగిరి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ప్రతిరోజూ సైకిల్ తొక్కడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో క్షయ వ్యాధి పర్యవేక్షకుడు బోగ్యం వెంకటేశ్వర్లు, సిబ్బంది జి.శ్రీనివాసులు, రామారావు, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.
- వరికుంటపాడు : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యసిబ్బంది మండలంలోని తిమ్మారెడ్డిపల్లిలో కేన్సర్ వ్యాధిపై అవగాహన కల్పిస్తూ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి కరిష్మా మాట్లాడుతూ ప్రతిరోజూ సైకిల్ తొక్కడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. ప్రతినెలా 14వ తేదీ ఆరోగ్య విషయాలపై గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ రాజశేఖరరాజు, సూపర్‌వైజర్ రియాజ్ పాల్గొన్నారు.
- కొండాపురం : ప్రతిరోజు తప్పక వ్యాయామం చేయాలని దామా చినబాబు మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం సులోచన దేవి అన్నారు. సాయిపేట గ్రామంలోని పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు వ్యాయామం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహనా ర్యాలీ, సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ వ్యాయామం చేయడం వల్ల మనస్సు ప్రశాంతంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు, ఏఎస్ఎం సుజాత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు అవసరం

మర్రిపాడు : ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై జాగ్రత్తలు వహించాలని హెల్త్ సూపర్‌వైజర్ సైదా పేర్కొన్నారు. మండలంలోని నందవరం గ్రామంలో కేన్సర్‌పై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రతిరోజు నడకతో మొదలై యోగా, సైక్లింగ్ చేయాలని సూచించారు. ప్రస్తుత జీవనశైలిలో గుండెజబ్బులు, బీపీ, షుగర్, కేన్సర్ వంటి జబ్బుల నుంచి దూరంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ సైకిల్ తొక్కాలన్నారు. అనంతరం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది ఖాదర్ బాబు, నూర్జహాన్ పాల్గొన్నారు.



అల్లూరు : అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ బ్రిజిత



అనుమసముద్రంపేటలో..



చేజర్ల మండల కేంద్రంలో..



వరికుంటపాడు : తిమ్మారెడ్డిపల్లిలో..



కొండాపురం : సాయిపేటలో..



మర్రిపాడు : నందవరంలో..



ఉదయగిరి పట్టణంలో..

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి

కావలి : ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని డీబీఎస్ కళాశాల కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్‌నాయుడు తెలిపారు. పట్టణంలోని డీబీఎస్ ఇంజినీరింగ్ కళాశాల వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా కళాశాల ఆవరణలో మంగళవారం మొక్కలు నాటి విద్యార్థులకు మొక్కల ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డీబీఎస్ కళాశాల స్థాపించి 14 సంవత్సరాలు పూర్తి చేసుకుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ దామిశెట్టి బాలసురేష్, ప్రిన్సిపల్ డాక్టర్ టీవీరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విరువూరులో 'ఫ్యామిలీ డాక్టర్'

వరికుంటపాడు : మండలంలోని విరువూరులో 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమాన్ని వైద్యాధికారిణి ఆయేషా మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె 45 మంది రోగులను పరీక్షించి మందులు అందజేశారు. ఈ వైద్యసేవలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ట్యాబ్‌ల వినియోగంపై అవగాహన



విద్యార్థికి అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ

ఉదయగిరి : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌ల వినియోగంపై మంగళవారం ఎంఈఓ మస్తాన్‌వలీ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు, హెచ్ఎంలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని విద్యార్థులకు ట్యాబ్‌లో బైజూస్ వినియోగంపై అవగాహన కల్పిస్తుండాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం గౌస్‌బాషా, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.